భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 26.0
తణుకు : 34.0 - 26.0

ఇళ్ల ముందు బైక్‌లే టార్గెట్ -7లో..



భీమవరంలోని అన్న క్యాంటీన్ భవనం

అన్న క్యాంటీన్లు వచ్చేస్తున్నాయ్..

రేపు పట్టణాల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు.. క్యాంటీన్లను తీర్చిదిద్దిన అధికారులు

భీమవరం టౌన్, ఆగస్టు 13 : ఈనెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం నాడు అన్న క్యాంటీన్‌లు ప్రారంభించాలని నిర్ణయించారు. దీనికోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం పేద ప్రజలకు 5 రూపాయలకే భోజనం అందించేలా అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాలోని భీమవరంలో 3, తాడేపల్లిగూడెం 3, నరసాపురం, పాలకొల్లు, తణుకు పట్టణాల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేశారు. ఈ క్యాంటీన్‌లకు ప్రజలను మంచి స్పందన వచ్చింది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం నుంచి భోజనం అందించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు ఐదేళ్ళపాటు సాగిన ఈ పథకానికి 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. ఆ తర్వాత ఈ భవనాలను వివిధ కార్యక్రమాలకు వినియోగించారు. భీమవరంలోని మూడు క్యాంటీన్‌లను వార్డు సచివాలయాలుగా మార్చివేశారు. దాదాపు నాలుగేళ్ళపాటు కొనసాగాయి. నరసాపురంలోని క్యాంటీన్‌ను నరసాపురం రూరల్ సీఐ కార్యాలయంగా మార్చేశారు.

మరలా పేదలకు అందుబాటులోకి..

వైసీపీని గద్దెదించి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం మరలా అన్న క్యాంటీన్‌లను వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఆఘమేఘాలపై మునిసిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. భీమవరంలోని వార్డు సచివాలయాలను తీసివేసి వాటిని వేరే చోటకు తరలించారు. నరసాపురంలోని సీఐ కార్యాలయాన్ని కూడా ఖాళీ చేయించారు.ఇప్పటికే అన్న క్యాంటీన్‌లను స్థానిక ప్రజా ప్రతినిధులు స్వయంగా పరిశీలించారు.

సార్‌ను కలవాలంటే.. ఫోన్ బయటపెట్టాల్సిందే!

- సిబ్బందిలో ఇద్దరికే అనుమతి
- ఓ తహసీల్దార్ వింత రూల్



నరసాపురం, ఆగస్టు 13: ఆయన ఓ తహసీల్దార్, జిల్లాలోని కీలక మండలంలో రెవెన్యూ అధికారిగా పని చేస్తున్నారు. ఇటీవలే బదిలీపై వచ్చారు, ఇంకా ఆయన పనితీరు సిబ్బందికి, ప్రజలకు పూర్తిగా తెలియరాలేదు. కానీ ఒక విషయం మాత్రం బాగా అర్థమైంది. అదే సార్‌కి ఫోన్ అంటే భయమని, ఎవరైనా అయ్యగార్ని కలవాలంటే ముందుగా ఫోన్‌ను బయట సిబ్బందికి అప్పగించాల్సిందే, లేకపోతే నో ఎంట్రీ, అన్ని చెక్ చేసిన తరువాతే ఆయన ఛాంబర్‌లోకి పంపుతారు. ఇప్పటి వరకు ఆ మండల ప్రజలకి ఈ తరహా రూల్స్ ఉంటాయని తెలియదు. ఈ రూల్ చూసి ఒక్కసారిగా అవాక్కవుతున్నారు. వినతులిచ్చే ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఇదే రూల్. ఈ విధానం కొంచెం ఇబ్బందికరంగా ఉండటంతో చాలా మంది సిబ్బందిని నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. తమ ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టి లోనికి వెళతామని లేదా ఫ్లైట్ మోడ్‌లో ఉంచి సార్‌ను కలుస్తామని చెప్పినా పంపించడం లేదు. కేవలం ఇద్దరికి మాత్రమే ఈ రూల్ నుంచి మినహాయింపు ఇచ్చారు. వారిలో ఒకరూ కార్యాలయ డీటీ అయితే మరొకరు ఆర్ఐ. ఈ కొత్త విధానం సిబ్బందికి కూడా పెద్ద తలనొప్పిగా మారింది. ప్రతిసారి సెల్‌ఫోన్ బయట పెట్టి లోనికి వెళ్లడం, మళ్లీ వచ్చి దాన్ని తీసుకోవడం కష్టంగా మారింది. అయితే సార్ ఎందుకు ఫోన్ బయట పెట్టామంటున్నారన్న దానిపై వింత వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో సార్ సంభాషణలను కొందరు రికార్డు చేశారని, ఈ కారణంగానే ఆయన ముందస్తు జాగ్రత్త పాటిస్తున్నారని కొందరు చెబుతుంటే.. మరికొందరు ఛాంబర్‌లో ఫోన్ డిస్టబెన్స్ ఉండకూడదన్న ఉద్దేశంతోనే బయట ఉంచమంటున్నారని చెప్పుకోవడం గమనార్హం. ఏది ఏమైనా మండల కార్యాలయంలో ఈ తరహా రూల్ పెట్టడం కాస్తా ఇబ్బందికరంగానే కనిపిస్తుంది.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫైర్ అధికారుల తనిఖీ

నరసాపురం, ఆగస్టు 13: ఇటీవల మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దగ్ధం తరువాత ప్రభుత్వం రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అప్రమత్తం చేసింది. దీనిలో భాగంగా రికార్డుల భద్రతను పరిశీలించాలని జిల్లా ఫైర్ అధికారుల్ని ఆదేశించింది. మంగళవారం నరసాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు, వైరింగ్, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కార్యాలయం ఏర్పాటు చేసి సుమారు 150 ఏళ్లు కావడం, పైకప్పు శిథిలం అవ్వడం, వర్షానికి తడవకుండా పైన తాత్కాలికంగా ప్లాస్టిక్ సీట్‌లను కప్పి ఉంచడాన్ని ఆయన పరిశీలించారు. నివేదికను జిల్లా అధికారులకు అందించనున్నారు. ఫైర్ అధికారి రాంభాస్కర్‌రావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రసాద్ ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి -7లో

కోర్ సబ్జెక్టులకు ఆదరణ

- అధికంగా ఉద్యోగాలు పొందుతున్న విద్యార్థులు
- ఈ ఏడాది వందశాతం ప్లేస్‌మెంట్స్



ఉద్యోగం అంటే సాఫ్ట్‌వేర్. లక్షల్లో జీతం. ముఖ్యనగరాల్లో జీవితం. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేస్తే ఉద్యోగాలకు కొదవుండదు. కంపెనీలు ఎత్తుకుపోతాయి. క్యాంపస్ సెలక్షన్స్‌లో ముందుగా ఉద్యోగం దొరికేది కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకే. ఇప్పటిదాకా విద్యార్థుల్లో ఇదే భావన ఉండేది. ఈ ఏడాది నుంచి యువత ఆలోచనల్లో మార్పు వస్తోంది. యాజమాన్యాలు సైతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌కు బదులుగా ఇతర సబ్జెక్టులు ఎంచుకోవాలని సూచిస్తున్నాయి. అందుకు బలమైన కారణం లేకపోలేదు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగాలు లభించడం కాస్త కష్టమైంది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ తగ్గాయి. మంచి ప్యాకేజీలు వచ్చినాసరే ఉద్యోగాలు విషయంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌కు కంపెనీలు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కోర్ సబ్జెక్ట్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు వంద శాతం ప్లేస్‌మెంట్స్ సాధించారు. సివిల్, కెమికల్, మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ సారి అవకాశాలు ఎక్కువగా లభించాయి. సీట్లు తక్కువగా ఉన్నాసరే కోర్ సబ్జెక్ట్‌ల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులే ముందుగా ఉద్యోగాలు పొందారు. ఆ సబ్జెక్ట్‌ల్లో డికోడింగ్ ప్రావీణ్యం ఉన్న విద్యార్థులకు సాఫ్ట్ వేర్ కంపెనీలు ప్రాధాన్యం ఇచ్చాయి. దాంతో ఏపీఈఏపీసెట్‌లో ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో యాజమాన్యాలు కోర్ సబ్జెక్ట్‌లు తీసుకోవాలంటూ సలహా ఇచ్చాయి. విద్యార్థులు సైతం వాటిపైనే కాస్త ఆసక్తి చూపారు.

ఏపీ నిట్‌లో 75 శాతం ప్లేస్‌మెంట్స్

తాడేపల్లిగూడెం ఏపీనిట్‌లోనూ ఈ ఏడాది 75శాతం ప్లేస్‌మెంట్స్‌కు సాధించారు. అదే అంతకు ముందు ఏడాది 100శాతం ప్లేస్‌మెంట్స్ సాధించింది. దేశవ్యాప్తంగా నిట్‌లలో ఈ సారి ప్లేస్‌మెంట్స్ తగ్గాయి. సాఫ్ట్‌వేర్ రంగం ఆశాజనకంగా లేకపోవడంతో కంపెనీలు పెద్దగా ముందుకు రాలేదు. అయినా సరే ఏపీనిట్ 75శాతం వరకు ప్లేస్‌మెంట్స్ సాధించి సత్తా చాటుకుంది. నిట్‌లో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులంతా జాబ్‌లు సాధించారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆ సబ్జెక్టే లేదు. ఏపీనిట్‌లో మాత్రం కెమికల్ ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు వంద శాతం ఉద్యోగాలు సాధించి రికార్డు సృష్టించారు. అలాగే బయోటెక్నాలజీ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు మంచి ప్యాకేజీలతోనే ప్లేస్‌మెంట్స్ సాధించారు. కెమికల్, బయో టెక్నాలజీ ఇంజనీరింగ్‌లో రూ. 10 లక్షల వార్షిక ప్యాకేజీ కూడా లభించింది.

ప్యాకేజీల్లో టాప్ సీఎస్ఈ

ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ రంగం కాస్త వెనుకపడడంతో ఆ ప్రభావం ప్లేస్‌మెంట్స్‌పై పడింది. అయినా సరే ఉద్యోగం సాధించిన విద్యార్థుల విషయానికొస్తే కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకే అత్యధిక ప్యాకేజీలు లభించాయి. ఏపీనిట్‌లో ఈ ఏడాది అత్యధిక ప్యాకేజీ రూ. 44 లక్షలు. ఇద్దరు విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఆ ప్యాకేజీలు పొందారు. అయితే ప్లేస్‌మెంట్స్ తగ్గాయి. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలదీ అదే పరిస్థితి. జిల్లాలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వంద శాతం ఉద్యోగాలు లభించాయి. ప్యాకేజీలు కాస్త తక్కువగా ఉన్నాసరే కోర్ సబ్జెక్ట్‌ల్లో ఉద్యోగం గ్యారంటీ అన్న భరోసా ఏర్పడింది. అంతా సాఫ్ట్ వేర్ రంగంపై ఆసక్తి చూపడంతో ఉత్పత్తి, తయారీ రంగంలో నిపుణుల కొరత ఏర్పడింది. దాంతో కంపెనీలు కోర్ సబ్జెక్ట్‌లపై ఆసక్తి చూపుతున్నాయి.

మేనేజ్‌మెంట్ కోటాలోనూ డిమాండ్

ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 30శాతం మేనేజెమెంట్ కోటా ఉంది. గతంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌కే అధిక డిమాండ్ ఉండేది. ఏడాదికి కనిష్ఠంగా రూ.4.00లక్షలు చెల్లించి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరేవారు. సివిల్, మెకానికల్ వంటి ఇంజనీరింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ఫీజుకు సమానంగా వసూలు చేసినా సరే విద్యార్థులు చేరేవారు కాదు. ఈ సారి మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌లపైనా విద్యార్థులు మొగ్గచూపారు. మేనేజ్‌మెంట్ కోటాలోనూ అన్ని సీట్లు భర్తీ అయిపోయాయి. కన్వీనర్ కోటాలోనూ జిల్లాలో అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్‌లు తీసుకున్నారు. ఇలా కోర్ సబ్జెక్ట్‌లకు డిమాండ్ పెరగడంతో ఇంజనీరింగ్ కళాశాలల్లో జోష్ నెలకొంది. మూడేళ్లలో కోర్ సబ్జెక్ట్‌లకు పూర్వవైభవం వస్తుందంటూ ఏపీనిట్ ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి దినేష్ శంకర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్పత్తి, తయారీ రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడింది. అందుకే కంపెనీలు కోర్ సబ్జెక్ట్‌లలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులను ఈ సారి ప్లేస్‌మెంట్స్‌లో ముందుగా ఎంపిక చేసుకున్నాయని దినేష్ శంకర్‌రెడ్డి వివరించారు.

బయో టెక్నాలజీపై ఆసక్తి



ఏపీనిట్‌లో బయోటెక్నాలజీ పూర్తి చేశాను. రూ. 10 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సంపాదించాను. నేను ఏపీనిట్‌లో చేరేనప్పుడు బయోటెక్నాలజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ రావాలంటే కష్టంగా ఉండేది. గత ఏడాదినుంచి మార్పు వచ్చింది. బయోటెక్నాలజీ అభ్యర్థులకు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. అందుకే నాకు పెద్ద ప్యాకేజీల్లోనే ఉద్యోగం వచ్చిందని భావిస్తున్నాను.

- అభిమన్యు తివారి, ఏపీనిట్

కెమికల్ ఇంజనీరింగ్‌తో ఉద్యోగం



గతంలో కెమికల్ ఇంజనీరింగ్ అంటే మంచి డిమాండ్ ఉండేది. ఇటీవల కాలంలో కెమికల్ ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యం తగ్గింది. అందుకే కళాశాలల్లో ఆ సబ్జెక్ట్ ఉండడం లేదు. ఐఐటీ , నిట్ వంటి సంస్థల్లోనే కెమికల్ ఇంజనీరింగ్ ఉంటోంది. ఆసక్తి కొద్దీ ఇదే కోర్సులో చేరాను. ఈ ఏడాది రూ. 10 లక్షల వార్షికవేతనంతో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది.

- ఆదర్శ్ సింగ్, ఏపీనిట్

వ్యర్థాలను మట్టిగా మారుస్తాం: కలెక్టర్

భీమవరం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు

భీమవరం టౌన్, ఆగస్టు 13 : భీమవరం పట్టణ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం లోసరి రోడ్డులోని యనమదుర్రు గట్టుపైన చెత్త డంపింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెత్త ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు అనుసరించి ప్రతి పట్టణంలో 20 సంవత్సరాలుగా భూమిలో నిక్షిప్తమైన లెగసి వ్యర్థాలను తవ్వి తీసి ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా మట్టిగా మార్చే ప్రక్రియను చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా 12 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను మట్టిగా మార్చే ప్రక్రియ చేపట్టడం జరిగిందని, దీని నిమిత్తం అయ్యే ఖర్చు మొత్తం రూ.96 లక్షలు సంబంధిత ఏజెన్సీకి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీని కారణంగా భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉండటంతో పాటు, ఏళ్ల తరబడి భూమిలో పొరలలో కరగకుండా మిగిలిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా మట్టిగా మార్పు చెందుతాయన్నారు. ప్రతి నగరంలో చెత్త అనేది పెద్ద సమస్యగా తయారైందని, ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. బీవీరాజు మునిసిపల్ పార్కు పరిశీలించారు. నగరం నడిబొడ్డులో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ఏకైక పార్కుగా ఇది ఉందని, దీనిని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు.



భీమవరంలో పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

తాడేరులో డంపిగ్‌యార్డు స్థలం పరిశీలన

గతంలో తాడేరు రోడ్డులో డంపింగ్ యార్డు నిమిత్తం కొనుగోలు చేసిన 6.5 ఎకరాల భూమని కలెక్టర్ నాగరాణి పరిశీలించారు. డంపింగ్‌కు అడ్డంకిగా ఉన్న విషయాలపై ఆరా తీశారు. దీనిపై అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. ఈ స్థలాన్ని వాటర్ ఎనర్జీ ప్లాంట్ లేదా బయోగ్యాస్ మిథైన్ ప్లాంట్ ఏర్పాటుకు వినియోగించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఏడేళ్ల కల

- పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు
- జిల్లాలో 54 మంది సిబ్బందికి ప్రయోజనం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించింది. ఏడేళ్ల నిరీక్షణ ఫలించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పదోన్నతులపై సంతకాలు పెట్టింది. ఉత్తర్వులు జారీచేసింది. ఆ దిశగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 54 మంది పంచాయతీ సిబ్బందికి తాజా నిర్ణయంతో లబ్ధి చేకూరింది. గ్రేడ్ -3 కార్యదర్శులుగా పనిచేసిన సిబ్బంది ఇప్పుడు గ్రేడ్-2 కార్యదర్శులుగా పదన్నోతి పొందారు. అలాగే సీనియర్ అసిసెంట్‌లు, బిల్ కలెక్టర్‌లకు కూడా గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. పంచాయతీ రాజ్ శాఖలో ఒక్కో నిర్ణయం సానుకూలంగా వెలువడుతుండడంతో ఉద్యోగుల్లోనూ, స్థానిక నేతల్లోనూ జోష్ నెలకొంది. స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలకోసం పంచాయతీలకు ఇది వరకే వెసులుబాటు కల్పించింది. మైనర్ పంచాయతీలు రూ. 15వేలు, మేజర్ పంచాయతీలు రూ. 25వేల వరకు నిధులు వెచ్చించుకోవచ్చని ఆదేశాలిచ్చింది. దాంతో స్వాతంత్ర్య వేడుకులను ఘనంగా నిర్వహించడానికి పంచాయతీలు సిద్ధమవుతున్నాయి. గడచిన ఐదేళ్లలో పంచాయతీలకు కనీస మర్యాద ఇవ్వలేదన్న అసంతృప్తి అందరిలోనూ ఉంది. పంచాయతీ సిబ్బంది నలిగిపోయారు. ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా పోయింది. నిధులు మంజూరు చేయలేదు. వైసీపీ హయంలో నిధులు దారిమళ్లాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. కేంద్రం నిధులు ఇచ్చిన వెంటనే పంచాయతీలకు జమకానున్నాయి. సర్పంచ్‌లు కూడా ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నా సరే లేని గౌరవం ఇప్పుడు వచ్చిందంటూ వైసీపీ తరపున ఎన్నికైన సర్పంచ్‌లే ఇప్పుడు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లోఉన్న ఉపాధి హామీ నిధులతో పనులు చేపడుతున్నారు. కాంట్రాక్టర్‌లు ముందుకొస్తున్నారు. తాజాగా సిబ్బందికి పదోన్నతులు లభించాయి. మున్ముందు నిధుల విషయంలోనూ పల్లెలకు మంచిరోజులు వస్తాయంటూ అంతా భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే పంచాయతీలు ఊపరిపీల్చుకున్నాయి. ఒక్కొక్క సమస్యకు పరిష్కారం లభిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిదినాలు పెంచారు. వైసీపీ హయాంలో పెండింగ్‌లో ఉండిపోయిన నిధులను నియోజకవర్గాలకు మంజూరు చేస్తున్నారు. జిల్లా పరిషత్ సీఈవోలే ఎమ్మెల్యేల వద్దకు వచ్చి సలహాలు ఇస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి నిధులను ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు. ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నత్తులు కూడా ఇప్పుడు లభించడంతో సిబ్బందిలోనూ ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా పంచాయతీ కార్యవర్గ ప్రతినిధులు కలెక్టర్ నాగరాణిని కలిసి పదోన్నతులను అమలుచేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.



ఒక్క ఫోన్ కాల్‌తో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్..

వ్యవసాయ శాఖ బోర్లకు టోల్ ఫ్రీ నెంబరు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 13: కూటమి ప్రభుత్వంలో రైతులకు అత్యంత తేలికగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇస్తోంది. ఒక్క ఫోన్ చేస్తే చాలు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేవిధంగా టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశారు. దీంతో రైతులు విద్యుత్ కనెక్షన్‌కు పెద్దగా ఇబ్బంది పడకుండా ఈ ఏర్పాటు చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. విద్యుత్ కనెక్షన్‌కు రైతులు వారి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. వారి పాస్‌బుక్ నెంబరు చెబితే సరిపోతుంది.

టోల్‌ఫ్రీ నెంబర్‌తో...

విద్యుత్ కనెక్షన్ పొందేందుకు 1912 టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటుచేసి విశాఖ కేంద్రంగా వ్యవసాయ కనెక్షన్‌లు అందిస్తున్నారు. వాటితోపాటు విద్యుత్ సమస్యల పరిష్కారానికి కూడా తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) శ్రీకారం చుట్టింది. ఈ విధానం ద్వారా అత్యవసర ప్రమాద సమాచారం నుంచి పోల్ పడిపోయినా కూడా ఈ టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇస్తే అధికారులు అప్రమత్తం అయ్యేందుకు అవకాశం ఉంటుంది.

అవినీతిని అరికట్టేందుకు ఇదో మార్గం..

విద్యుత్‌శాఖలో రెండేళ్ల కాలంలో పట్టుబడిన ఏసీబి కేసుల్లో సగం వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ మంజూరుకు డబ్బులు డిమాండ్ చేసి దొరికిపోయినవే. ఈ టోల్‌ఫ్రీ విధానం ద్వారా అవినీతిని అరికట్టేందుకు ఓ రాజమార్గంగా చెప్పవచ్చు.

విద్యుత్ కనెక్షన్ పొందేదిలా..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం 1912కు ఫోన్ చేసిన రైతు తన భూమి ఖాతా సంఖ్య, సర్వే నెంబరు చెప్పిన వెంటనే వెబ్‌ల్యాండ్‌లో ఆయా వివరాలు సరిచూసి రిజిస్ట్రేషన్ పూర్తిచేస్తారు. ఈ విధానం కోసం ఓ విభాగం పనిచేస్తున్నది. ఉమ్మడి 13 జిల్లాలకు ఈ విభాగం విశాఖ కేంద్రంగా ప్రతీరోజూ కనిష్ఠంగా 60 విద్యుత్ కనెక్షన్‌లు అందిస్తున్నారు. నెల రోజులుగా 1400 కనెక్షన్‌లు అందించారు.



గుమస్తాతో వాగ్వాదం చేస్తున్న శ్రీపర్రు గ్రామస్థులు

సొమ్ము ఇవ్వకుంటే ముట్టడిస్తాం

చెరువు లీజు సొమ్ము కోసం మాజీ ఎమ్మెల్యే ఇంటి దగ్గర శ్రీపర్రు గ్రామస్థుల నిరసన

పెదవేగి, ఆగస్టు 13 : చెరువుల లీజు సొమ్ము తన దగ్గర పెట్టుకుని ఇవ్వకుండా ముఖం చాటేసిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి.. లీజు సొమ్ము తక్షణం చెల్లించాలని కోరుతూ శ్రీపర్రు గ్రామస్థులు మంగళవారం ఆయన ఇంటి దగ్గర నిరసన తెలిపారు. పెదవేగి మండలం కొండలరావు పాలెంలోని అబ్బయ్యచౌదరి ఇంటికి శ్రీపర్రు నుంచి భారీగా చేరుకున్న గ్రామస్తులు ఇంటి ఎదుట నినాదాలు చేశారు. అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర లేకపోవడంతో సొమ్ము విషయమై గుమస్తాకు వివరించి లీజు సొమ్ము ఇవ్వకపోతే ఇంటి దగ్గర ధర్నా చేపడతామని హెచ్చరించారు. శ్రీపర్రుకు చెందిన 75 ఎకరాల చేపల చెరువు కోమటిలంక గ్రామంలో ఉందని, ఆ చెరువులకు సంబంధించి గ్రామస్తులకు రావాల్సిన కౌలు సొమ్ము తన దగ్గర పెట్టుకుని ఎన్నిసార్లు అడిగినా అధికార దర్పంతో ఇవ్వలేదని గ్రామస్తులు ఆరోపించారు. విదేశాల నుంచి వస్తారో? ఇక్కడ ఉన్నవారితో ఆ సొమ్ము కట్టిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న సమయంలో సొమ్ము విషయంలో ప్రశ్నించిన శ్రీపర్రుకు చెందిన సైదు గోరవర్ధన్‌పై అక్రమ కేసులు బనాయించడంతో పాటు రౌడీ షీటు కూడా ఓపెన్ చేయించారని ఆరోపించారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై భౌతిక దాడులకు తెగబడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సొమ్ము ఇవ్వకుండా తండ్రీ, కొడుకులు పారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదవేగి ఇన్‌చార్జ్ సీఐ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్తులను సముదాయించి అక్కడ నుంచి పంపేశారు.

ఎమ్మెల్యే చింతమనేనికి మాజీ ఎమ్మెల్యే బెదిరింపులు

ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 13 : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, అతని అనుచరులు గత కొంతకాలం నుంచి రకరకాల నెంబర్ల నుంచి ఫోన్లు చేసి బెదిరించడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు గత కొంత కాలం నుంచి దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, అతని ప్రధాన అనుచరుడు కామిరెడ్డి నాని, అతని అనుచరులు రకరకాల సెల్ నెంబర్ల ద్వారా బెదిరింపులకు పాల్పడుతూ అసభ్యంగా దుర్భాషలాడారు. దీంతో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, కామిరెడ్డి నాని వారి అనుచరులపై కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 40 నెంబర్లకు పైగా వారు వినియోగించి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొనగా పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

కరుగోరుమిల్లిలో వెలి కేసుపై విచారణ



ఆచంట, ఆగస్టు 13 : ఆచంట మండలం కరుగోరుమిల్లికి చెందిన గూడూరి వరలక్ష్మి తనను గ్రామానికి చెందిన కొంతమంది కుల సంఘం నాయకులు వెలి వేశారని గత నెల 15వ తేదీన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ డీఎస్పీకి అప్ప గించడంతో డీఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఆచంట ఆర్ఐ జయలలిత స్థానిక వీఆర్వో చిట్టూరి శ్రీహరిలు గ్రామంలో విచారణ చేపట్టారు. వరలక్ష్మి గ్రామానికి చెందిన 12 మంది కుల సంఘం నేతలు తనను వెలి వేశారని చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఆర్ఐ తెలిపారు. వివరాలు సేకరించామని వీటిని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. దీనిపై వరలక్ష్మి స్థానిక పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసింది.



వివరాలు తెలుపుతున్న తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి

ఇళ్ల ముందు బైక్‌లే టార్గెట్

14 మోటారు సైకిళ్లు స్వాధీనం..ఐదుగురి అరెస్టు



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 13: ఇళ్ల ముందు ఉంచిన మోటారుసైకిల్స్‌ను నిఘా వేసి అపహరించే ఐదుగురిని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.9 లక్షల విలువ చేసే 14 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మూర్తి మంగళవారం విలేకరుకు వివరాలు తెలియజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన గుత్తుల జయప్రకాష్, బత్తుల యేసు వర్మ, మునిరి నరేష్, ఉంగుటూరు మండలం వెల్లమిల్లికి చెందిన తప్పెటల శశికుమార్, ఉండి మండలం మహదేవుని పట్నంకు చెందిన వీరవల్లి వెంకటేష్ (పరారీలో ఉన్నాడు) ముఠాగా ఏర్పడ్డారు. రాత్రి సమయంలో ఇళ్ల వద్ద పార్కు చేసిన మోటారు సైకిళ్లపై నిఘా పెడతారు.ఆ బృందంలో కొందరు సీసీ కెమెరాలు లేని ప్రాంతాన్ని ఎంపిక చేస్తారు. మోటారుసైకిళ్ల హ్యాండిల్ లాక్‌ను తొలగించడంలో కూడా వీరు నిపుణులు. వారు చోరీ చేసిన మోటారుసైకిళ్లను తాడేపల్లి గూడెం మండలం బంగారుగూడెంకు చెందిన మెకానిక్ నరసింహ మూర్తికి అప్పగిస్తే అతని వద్దకు వచ్చే కస్టమర్‌లకు విక్రయిస్తుంటాడు. తాడేపల్లిగూడెం, తణుకు, గణపవరం స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న చోరీలపై సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ అద్నాన్ నయిం ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెట్టారు. నల్లజర్ల రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా ఉన్న ఈ ముఠాలోని సభ్యులను పట్టుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. నిందితుల దగ్గర రూ.9 లక్షల విలువ చేసే 14 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై సుధాకర రెడ్డి, సిబ్బందిని డీఎస్పీ మూర్తి అభినందించారు.

ఇంటి ఎదురుగా పార్కు చేసిన కొత్త బైక్ మాయం

ఆకివీడు, ఆగస్టు 13 : ఇంటి ఎదురుగా పార్కు చేసిన హుండా యాక్టీవ్ కనబడుట లేదని ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆకివీడు వివేకానందనగర్ కాలనీకి చెందిన గంట్యాడ రాము ఈ నెల 6న కొత్త యాక్టివా బైక్ కొన్నాడు. 8వ తేదీ రాత్రి ఇంటి ఎదురుగా పార్కు చేసి మరుసటి రోజు ఉదయం చూసే సరికి కనబడలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మా రోడ్డుకు మోక్షమెప్పుడు ?

ఇరవై ఏళ్లుగా ఎదురుచూపులు

బోయగూడెం, సీతానగరం వాసుల అవస్థలు



అధ్వానంగా ఉన్న బోయగూడెం- సీతానగరం రోడ్డు

చింతలపూడి, ఆగస్టు 13: మండలంలోని బోయగూడెం, సీతానగరం రోడ్డుకు మోక్షం ఎప్పుడా అని ఆ గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ రోడ్డు దెబ్బతినడంతో 20 ఏళ్లుగా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. 20 ఏళ్లలో శాసనసభ్యులు మారారు. పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారు. 15 సంవత్సరాలుగా బస్సులు కూడా తిరగడం లేదు. కాలి బాటనే ఈ గ్రామాల ప్రజలు నిత్యం చింతలపూడికి వస్తుంటారు. 17 కిలోమీటర్ల పొడవున మూడు గ్రామ పంచాయతీలు, 11 శివారు గ్రామాలు ఉన్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాయకులు హామీలతో సరిపెడుతూ వస్తున్నారు. ఈ గ్రామాల ప్రజలు ధర్నాలు జరిపారు. ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీశారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ.8 కోట్లు మంజూరుచేసి శంకుస్థాపన కూడా జరిపారు. 2019లో ప్రభుత్వం మారినా ఈ రోడ్డుకు మోక్షం కలగలేదు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఊసు కూడా ఎత్తలేదు. మోసపోయామని గ్రామాల ప్రజలు భావించారు. అయితే 2023లో ఎన్నికలు వస్తున్న సమయాన్ని చూసుకుని హడావుడిగా వైసీపీ నాయకులు ఈ రోడ్డుకు రూ.20 కోట్లు మంజూరయ్యాయంటూ హడావుడి చేశారు. వైసీపీ పాలనలో బిల్లులు మంజూరు అవ్వడం లేదని, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఆ గ్రామాల ప్రజలకు నాయకులు సర్ది చెప్పారు.ఈ రోడ్డంతా గోతులమయంగా మారింది. శెట్టివారిగూడెం వద్ద గ్రామస్థులు కొందరు కలుగచేసుకుని కొంత మేర వాహనాలు తిరిగే విధంగా మట్టి పోసుకున్నారు. అది ఎన్నాళ్లో నిలువ లేదు. పామాయిల్, వరి, వేరుశెనగ, అరటి, మామిడి పంటలు తరలించటానికి రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. విద్యార్థులు చదువుల కోసం ఆటో, లేదంటే ఏదో వాహనాన్ని పట్టుకుని పాఠశాలలకు వచ్చి వెళ్ళాల్సిందే. 20 సంవత్సరాలుగా ఇదే తంతు. ఇప్పుడు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయనున్నది. ఈ గ్రామాల ప్రజలు ఇప్పుడు మావూరికి బస్సు ఏదంటూ నాయకులను ప్రశ్నిస్తున్నారు. గతంలో 15 ఏళ్ళ కిందటే 8 బస్సు సర్వీసులు తిరిగేవి. ఇప్పుడు జనాభా పెరిగారు ? రవాణా అవసరాలు పెరిగాయి. కూటమి ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. మా రోడ్డుకు మోక్షం కలిగిస్తారా అంటూ గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.



సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్‌కు విరాళం చెక్కు అందజేస్తున్న వీఎస్‌పి ప్రతినిధులు

సీఆర్ఆర్ సొసైటీ అభివృద్ధికి అక్కినేని కుటుంబ సభ్యుల విరాళం

ఏలూరు అర్బన్, ఆగస్టు 13 : సీఆర్ రెడ్డి విద్యాసంస్థల సొసైటీ అభివృద్ధి నిమిత్తం దివంగత వీరమాచనేని శివరామప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు అక్కినేని జ్యోత్స్న, వేములపల్లి సునీత వీఎస్‌పీ ఫౌండేషన్ తరపున రూ.కోటి విరాళాన్ని బ్యాంకు చెక్కు ద్వారా సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్‌కు ఏలూరులో అందజేశారు. ప్రముఖ సినీ నటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు కుటుంబసభ్యులు అక్కినేని ఆదిత్య, వేములపల్లి రోహిత్, మొటపర్తి వెంకట్, సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, కోశాధికారి చిట్టూరి జానకిరామయ్య, ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.వి.బాలకృష్ణారావు, సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి కొడాలి వెంకట సుబ్బారావు, ఇతర మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దేవాలయ భూముల సమస్యలపై దృష్టి పెట్టండి

భీమవరం టౌన్, ఆగస్టు 13 : ఈనెల 16వ తేదీ నుంచి జిల్లాలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనేందుకు, దేవదాయ శాఖకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు 20 మండలాలకు సంబంధించి 65 మందిని నియమించినట్లు దేవదాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు తెలిపారు. ప్రతీ మండలానికి ఒక ఈవోతో పాటు ఇద్దరు గుమస్తాలను నియమించామని చెప్పారు. రెవెన్యూ సదస్సు జరిగే గ్రామంలోని దేవాలయాలకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో నమోదు సక్రమంగా జరిగాయా లేదా సరి చూసుకుని ఇబ్బందులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశామన్నారు. సర్వే నెంబర్లను సరిచూసుకోవాలన్నారు. సదస్సుల్లో జరిగిన వివరాలను ఆదే రోజు సాయంత్రంలోగా జిల్లా కార్యాలయానికి అందించాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ నయీం అస్మి

బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు

పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, ఆగస్టు 13 : ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామని, జంక్షన్లు, ముఖ్యంగా జాతీయ రహదారితో, స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం ఆధ్వర్యంలో మంగళవారం రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, వాటికి గల కారణాలు, నివారణా చర్యలపై చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారుల జంక్షన్లు వద్ద లైటింగ్ పెంచాలన్నారు. హెల్మెట్ వాడకం, రహదారి భద్రతా నియమాలు పాటించకపోతే విధించబడే జరిమానాలు తదితర అంశాలపై పోలీస్, రవాణా శాఖలు అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించేలా వారిని చైతన్య పరచాలని కోరారు. ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, పంచాయతీ, మున్సిపాలిటీలు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి జాబితాను అందజేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఎస్పీని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, అదనపు ఎస్పీ (ఎస్బీ)రవికుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడుటౌన్, ఆగస్టు 13: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఈఈఈ విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్ పొందినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఈఈఈ చివరి ఏడాదికి చెందిన 18 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీ ఫొటో ఓల్టాయిక్ కంపెనీలో నెలకు రూ.15 వేలు స్టైపెండ్‌తో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక య్యారన్నారు. వీరితో పాటు బిడ్ అలెర్ట్ కంపెనీలో మరో 20 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలి పారు. విద్యార్థులను ఏవో పి.చంద్రశేఖర్, డీన్ ఆఫ్ అకడమిక్స్ రత్నాకర్ తదితరులు అభినందించారు.

ఈశాన్యంలో ఉంటే అరిష్టమట..

పంచాయతీలో పచ్చని చెట్లపై వేటు



ద్వారకాతిరుమల పంచాయతీలో చెట్లను నరికి ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల, ఆగస్టు 13: పంచాయతీకి కలిసి రావడం లేదని పచ్చని చెట్లను కొట్టి పడేశారు. మొక్కలను పెంచి పోషించాలని ఓ వైపు అధికారులు ప్రచారం చేస్తుండగా ఇక్కడ మాత్రం ఏళ్లుగా పెరిగి పెద్దవైన పచ్చని చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. ద్వారకా తిరుమల గ్రామ సచివాలయ కార్యాలయ ఆవరణలో ఉన్న పెద్ద పెద్ద చెట్లను మంగళవారం తొలగించారు.ఈశాన్యంలో ఇలా చెట్లు ఉంటే పంచాయతీకి అరిష్టమని ఓ సిద్ధాంతి చెప్పిన మాట పట్టుకుని చెట్లను నరికేశారు. ఏళ్లక్రితం నాటిన చెట్లను నిర్దాక్షిణ్యంగా కూలకొడుతున్నా స్థానిక అధికారులు పట్టనట్లు వ్యవహరించడం దారుణమని ప్రజలు అంటున్నారు. మొక్కల పెంచడం మాట అటుంచి ఉన్న చెట్లను కూడా కాపాడలేక పోతే ఎలా అని అంటున్నారు. పచ్చని చెట్లతో కళలాడుతూ ఉండే పంచాయతీ కార్యాలయ ఆవరణ వెలవెలబోయింది. దీనిపై పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వరరావు వివరణ కోరగా అడ్డం వస్తున్నాయని చెట్లను నరికి వేస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాకు ఇంటింటా సర్వే నిర్వహించండి

భీమవరం టౌన్, ఆగస్టు 13 : సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్వోలతో సమా వేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు. ఎన్నికల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఈనెల 20 నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అక్టోబరు 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. అక్టోబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 24వ తేదీలోగా అభ్యం తరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపట్టాల న్నారు. 2025 జనవరి ఒకటో తేదీలోగా నిబంధనల మేరకు జాబితా సిద్ధమైందో లేదో పరిశీలించాలన్నారు. జనవరి ఆరో తేదీన సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గ దర్శకాలు పక్కాగా అమలు చేయాలన్నారు.

ఆక్వా యూనివర్సిటీలో బీఎస్సీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

నరసాపురం రూరల్, ఆగస్టు 13: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో తుఫాన్ భవనంలో నిర్వహిస్తున్న ఏపీ మత్స్య విశ్వ విద్యాలయంలో బీఎఫ్‌ఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్) నాలుగేళ్ల కోర్సుకు అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఇందులో స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించనున్నారు. మిగిలిన 15 శాతం తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులు పోటీపడవచ్చు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ నేచురల్ సైన్స్ ప్రధాన సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ప్రభుత్వం నిర్వహించిన ఏపీఈఏపీసెట్ 2024 ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 20లోపు యూనివర్సిటీ వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని రిజిస్ట్రార్ సుధాకర్ పేర్కొన్నారు.

క్రైం కార్నర్



ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు.. పేలిన గ్యాస్ సిలిండర్

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

పెదపాడు, ఆగస్టు 13 : వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు రావడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైన ఘటన పెదపాడు మండలం కొత్తూరులో మంగళవారం చోటు చేసుకుంది. కొత్తూరు బీసీ కాలనీలో నివాసముంటున్న దిమ్మిటి నాగేశ్వరమ్మ ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే ఆమె భయంతో బయటకు పరుగులు తీసింది. చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఏలూరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు ఈ ప్రమాదంలో రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది.నగదుతో పాటుగా బంగారం కూడా కాలిపోయిందని నాగేశ్వరమ్మ తెలిపింది. బాధితురాలికి టీడీపీ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్ లావేటి శ్రీనివాసరావు, కొత్తూరు చినబాబులు నిత్యావసర సరుకులు అందజేశారు. పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ బియ్యం, దుప్పట్లు, కూరగాయలను బాధితురాలికి అందజేశారు.

ముగ్గురిపై పోక్సో కేసు కొట్టివేత

బుట్టాయగూడెం, ఆగస్టు 13 : ముగ్గురిపై పోక్సో కేసును కొట్టివేస్తూ మంగళవారం పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి సునంద తీర్పు ఇచ్చినట్టు డిఫెన్స్ న్యాయవాది ఏసుబాబు విలేకరులకు తెలిపారు. 2014లో బుట్టాయగూడెంలోని ఒక బాలికల వసతి గృహానికి చెందిన ముగ్గురు బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారం జరిగిందని అప్పటి కొయ్యలగూడెం సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బుట్టాయగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన అప్పటి సబ్ డివిజన్ పోలీస్ అధికారి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో వసతిగృహంలో అవుట్‌సోర్సింగ్‌గా పనిచేస్తున్న వర్కర్ గ్రామంలో కొందరు యువకులతో కుమ్మక్కై వారి నుంచి కొంత నగదు తీసుకుని బాలికలను వారివద్దకు పంపేదని హస్టల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసరుకు ఫోన్‌చేసి చెప్పడంతో ఏఎస్‌డబ్ల్యూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసులో హస్టల్ వర్కర్‌తో పాటు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా సాక్ష్యాలను తగలబెట్టారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసరుపై కేసు నమోదు చేసి పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 33 మందిని విచారించి పోలీసులు జిల్లా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సుదీర్ఘంగా 16 మంది సాక్షులను పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి సునంద విచారించారు. నేరాన్ని రుజువుచేసే సాక్ష్యాలను కోర్టులో చేయలేక పోయినందున మంగళవారం కేసును కొట్టి వేసినట్లు న్యాయవాది ఏసుబాబు తెలిపారు. కేసులో మొదటి ముద్దాయి మరణించగా 5వ ముద్దాయిగా ఉన్న హస్టల్ వెల్ఫేర్ ఆఫీసరును ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి ఏఎస్‌డబ్ల్యూవోను సస్పెండ్ చేశారు. ముద్దాయిల్లో ఒకరు బాల నేరస్తుడైనందున బాలల న్యాయస్థానంలో విచారణ జరగవలసి ఉందని, మిగిలిన ముగ్గురిపై ఉన్న కేసును కొట్టి వేసినట్లు ఏసుబాబు తెలిపారు.

కుటుంబ కలహాలు..భర్తపై భార్య దాడి

పాలకోడేరు, ఆగస్టు 13: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తపై భార్య దాడి చేసిన ఘటన వేండ్ర అగ్ర హారంలో జరిగింది. ఏఎస్సై మోహనరావు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కడలి మోహనరావు, లక్ష్మీ భార్యభర్తలు. వీరిద్దరూ కొంత కాలంగా గొడవలు పడుతున్నారు. సోమవారం చిన్న విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తీవ్ర కోపంతో భార్య ఇంట్లో ఉన్న కొడవలితో దాడి చేయడంతో భర్త మోహనరావుకు పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు అతడిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



లారీ కిందకు దూసుకెళ్లిన కారు







ప్రమాదంలో మృతి చెందిన నాగార్జున,మనోజ్, సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటోలు)

దెందులూరు/దేవరపల్లి, ఆగస్టు 13 : జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారులో వస్తూ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జున, దొమ్మేటి మనోజ్ కుమార్, యాగంటి సుబ్రహ్మణ్యంలు విజయవాడ ఆసుపత్రికి వెళ్లారు. పని ముగించుకుని మంగళవారం కారులో వస్తుండగా దెందులూరు మండలం 16వ నెంబర్ జాతీయ రహదారి సత్యనారాయణపురం సమీపంలో ఆగి ఉన్న లారీని బలంగా వెనుక నుంచి ఢీ కొట్టడంతో కారు లారీ కిందకు వెళ్లిపోయింది. దీంతో కారులో ఉన్న నాగర్జున (35), సుబ్రహ్మణ్యం (55) అక్కడిక్కడే మృతి చెందగా మనోజ్ కుమార్‌కు తీవ్ర గాయాలవగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవరపల్లిలో విషాదఛాయలు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో దేవరపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. దేవరపల్లి గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జున జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన తన మేనమామ యాగంటి సుబ్రహ్మణ్యంకు అనారోగ్యంగా ఉండడంతో దేవరపల్లి నుంచి మంగళవారం ఉదయం విజయవాడ ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు శివారు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో నాగార్జున, సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందారు. నాగార్జున చిన్నాన్న కుమారుడు మనోజ్ (18)కు తీవ్ర గాయాలు కావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగార్జునకు భార్య, కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యానికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనోజ్ మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ గుజరాత్‌లో చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులను చూడడానికి దేవరపల్లి వచ్చాడు. అతడికి తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. ముగ్గురూ మృతి చెందటంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

ఉండి ఆగస్టు 13: ఉండి గోరింతోటలో హత్యకు గురైన నల్లగంగుల నిఖిల్ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు తెలిపారు. భీమవరం గునుపూడికి చెందిన నిఖిల్‌ను ఆదివారం రాత్రి ఉండి గోరింతోటలో హత్య చేసిన నేరంపై పాలకొల్లుకు చెందిన ముల్లం పవన్ కుమార్ (25), భీమవరానికి చెందిన కోతాడ మారేష్ (22) ఉండి బస్టాండ్‌లో వున్నట్లు సమాచారం రావడంతో అరెస్ట్ చేసి భీమవరం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించిందని తణుకు సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ జగదీశ్వరరావు తెలిపారు.

పాముకాటుతో మహిళా కూలీ మృతి



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 13: పేరంపేట గ్రామానికి చెందిన ఎడ్లపల్లి వెంకాయమ్మ (38) పాముకాటుకు గురై మృతి చెందింది. వెంకాయమ్మ ఉదయం తోటి కూలీలతో కలసి డ్రిప్ పైపులు లాగేందుకు పనికి వెళ్లింది. పైపుల్లో ఉన్న తాచుపాము వెంకాయమ్మ ఎడమ చేతిపై కాటు వేసింది. అక్కడున్నవారు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఆమె భర్త దానియేలు చెప్పారు.టీడీపీ కార్యకర్త కావడంతో గ్రామ పార్టీ అధ్యక్షుడు గోలి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

భర్త వేధింపులతో ఆత్మహత్య

మండవల్లి, ఆగస్టు 13 : భర్త వేధింపులతో మనస్థాపానికి గురై భార్య ఆత్మహత్య చేసు కున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మండవల్లి పోలీసుల వివరాల ప్రకారం మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన కోరసిక శ్రీనివాసరావు కుమార్తె సత్యవతి (24)కి, మూను కొండ గ్రామానికి చెందిన కుందేటి బాపయ్య కుమారుడు మణికంఠతో ఈ ఏడాది మార్చిలో ప్రేమ వివాహం జరిగింది.అయితే సత్యవతిని భర్త, అత్తమామలు రూ.5 లక్షలు కట్నంగా తేవాలని చిత్రహింసలకు గురి చేస్తుండడంతో గ్రామపెద్దల సమక్షంలో విడాకులు తీసుకోవడానికి ఒప్పుకొని సంతకాలు చేశారని, అయితే భర్త సత్యవతికి ఫోన్ చేసి 'నీ వీడియోలు, ఫోటోలు నా దగ్గర ఉన్నాయి, డైవర్స్ ఇచ్చి మళ్లీ ఎలా పెళ్లి చేసుకుంటావో చూస్తా'నని బెదిరించడంతో మన స్థాపానికి గురై ఈ నెల 9న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. గుడివాడలోని ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 12వ తేదీ సాయంత్రం మరణించినట్లు పోలీసులు తెలిపారు. మండవల్లి ఎస్సై రామచంద్రరావు కేసు నమోదు చేయగా, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని బుట్టాయగూడెం అంబేద్కర్ పేట సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బుట్టాయగూడేనికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బుట్టాయగూడెం కుమ్మరపేటకు చెందిన వమ్మిడివరపు నీలాసాయి, నీలం వీరబాబులు శివాలయం వైపు నుంచి బుట్టాయగూడెం ద్విచక్ర వాహనంపై వస్తుండగా బుట్టాయగూడెం నుంచి కన్నాపురం వెళుతున్న కారు వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో నీలాసాయి తలకు, కాళ్ళకు తీవ్ర గాయాలవగా వీరబాబు స్వల్పంగా గాయపడ్డాడు. ఇరువురిని 108లో బుట్టాయగూడెం సీహెచ్‌సికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం లీలాసాయిని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. వీరిని ఢీకొన్న కారు ఆగకుండానే అతివేగంగా వెళ్ళిపోయి నందాపురం సమీపంలో ట్రాక్టరును ఢీకొట్టింది. వాహనంలో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన ఇద్దరూ మంగయ్యపాలెం వైసీపీ ఎంపీటీసీ కుమారులుగా పోలీసులు గుర్తించారు. కారును మంగయ్యపాలెం పొలాల్లో వదలి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు.

సారా తయారీ స్థావరంపై దాడి

ముసునూరు, ఆగస్టు 13: చెక్కపల్లి అడవిలో సారా తయారీ స్థావరంపై ముసునూరు పోలీసులు మంగళవారం దాడి చేసి తాళం మహేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు.మూడు లీటర్ల సారా, గ్యాస్ పొయ్యి, సిలిండర్, డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

పాఠశాలలను భ్రష్టుపట్టించిన వైసీపీ : ఆరిమిల్లి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 13: వైసీపీ పాలనలో పాఠశాలలను పట్టించు కోకుండా భ్రష్టుపట్టించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నాడు-నేడు అని వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని వివరించారు. కూటమి నాయకులు గోపిశెట్టి రామకృష్ణ, అనాల ఆదినారాయణ, పితాని మోహన్, చిక్కాల వేణు, ఆకేటి కాశి, తాతపూడి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి..

తణుకు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ నాగరాణిని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని కూడా కలిశారు.

రూ. 5.6 కోట్లతో రహదార్ల నిర్మాణం : బొలిశెట్టి



అప్పారావుపేటలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 13: పల్లెలకు కూటమి ప్రభుత్వం పండగ తెస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి ఉపాధి నిధులు రూ.5.60 కోట్లతో సీసీ రహదారులను నిర్మించనున్నట్టు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం



గొర్రెల లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద వలవల బాబ్జి, గొర్రెల శ్రీధర్ నివాళి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 13: హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం పట్టణంలో తాలూకా సెంటర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద గొర్రెల లక్ష్మీనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. తొలుత లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం గొర్రెల శ్రీధర్ దంపతులను బాబ్జి సత్కరించారు. పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, బండి పెద్దిరాజు, దాసరి కృష్ణవేణి, సుభద్ర, ఆకాశపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

'భయానక విభజన' ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

భీమవరంటౌన్, ఆగస్టు 13 :భయానక విభజన స్మరణ దినోత్సవాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో భీమవరం మెయిన్ బ్రాంచిలో రెండు రోజులపాటు నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్‌ను బ్యాంకు కస్టమర్లు, బ్యాంకు అధికారుల సమక్షంలో మంగళవారం ప్రారంభించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించిన యూబీఐ చీఫ్ మేనేజర్ సంగీత మాట్లాడారు. ఆనాడు పాకిస్థాన్ విభజన కోసం మత ప్రాతిపదికన ప్రజల్లో భయానక ఆందోళనలు కల్పించారని, అటువంటి దుశ్చర్యలు ఎక్కడా జరుగకుండా ఉండాలనే ప్రధాని పిలుపుమేరకు భయానక విభజన స్మరణ దినాన్ని దేశవ్యాప్తంగా పట్టణా ల్లో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొండాడ రామ్మోహనరావు, సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, కనుమూరి సత్యనారాయణరాజు మాట్లాడారు. యూబీఐ భీమవరం శాఖ చీఫ్ మేనేజర్ నిర్మలా జ్యోతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆలయాల్లో సభ్యులుగా అవకాశమివ్వాలి'

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 13: నాయీ బ్రాహ్మణులకు ప్రతి దేవాలయంలోనూ సభ్యులుగా భాగస్వామ్యం కల్పించాలని జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుమ్ములూరు శ్రీహరిరావు, ప్రధాన కార్యదర్శి కొడవర్తి శివప్రసాద్ ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘానికి కమ్యూనిటీ భవనం కోసం స్థలంతో పాటు నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. సంఘం నాయకులు ఉప్పలపు పెద్దిరాజు, పి.పోతురాజు, పట్నాల శంకరం, పసుమర్తి శ్రీనివాస్, మురళీకృష్ణ, బండారు పెద్దిరాజు పాల్గొన్నారు

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల

తణుకు, ఆగస్టు 13: ఎస్కేఎస్డీ మహిళా కళాశాల డిగ్రీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం నాల్గో సెమిస్టర్ ఫలితాలను కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి మంగళవారం తన చాంబర్‌లో విడుదల చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 79 శాతం, ద్వితీయ సంవత్సరం 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కేవీ రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ కుమార్, నందిగం సుధాకర్, చిట్టూరి వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసిన కూటమి నేతలు



గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న నాగేశ్వరరావు

భీమవరం అర్బన్, ఆగస్టు 13 : గత వైసీపీ ప్రభుత్వంలో దేశ స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాల నిర్వహణలో అలసత్వం వహించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని కూటమి నాయకులు మంగళవారం శుభ్రం చేశారు. కూటమి నాయకులు గంటా త్రిమూర్తులు, వి.రాఘవులు, చల్లా రాము, కొప్పినీడి బాబి, కోళ్ళ నాగబాబు, గొర్త గోపి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **కాళ్ళ, ఆగస్టు 13 :** గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఈనెల 16 నుంచి 31 వరకు కాళ్ళ మండలంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఈ.నాగార్జున మంగళవారం తెలిపారు.
- **భీమవరం అర్బన్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయాలని భీమవరంలోని డాక్టర్ అంబేడ్కర్ భవనంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు.
- **ఆకివీడు రూరల్:** దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ కళాశాలను ఈనెల 29, 30 తేదీల్లో బెంగళూరు నుంచి వచ్చే నాక్ బృందం పర్యటిస్తారని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఈనెల 25న కాలేజీలో పూర్వపు విద్యార్థులు సమావేశం నిర్వహిస్తామన్నారు.
- **భీమవరంటౌన్ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మంగళవారం భీమవరంలో కాగడాల ప్రదర్శన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జూలపాలెం రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి మావుళ్ళమ్మ ఆలయం వరకు నిర్వహించారు.






ఎమ్మెల్యే అంజిబాబుకు జెండా, లేఖను అందిస్తున్న పోస్టల్ అధికారులు... పాలకొల్లులో కూటమి నాయకుల ర్యాలీ.. ఆకివీడులో జాతీయ జెండాతో బీజేపీ శ్రేణుల ర్యాలీ.. గణపవరం డిగ్రీ కాలేజీ విద్యార్థుల ర్యాలీ

ప్రతి భారతీయుడు దేశభక్తి చాటాలి

- భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు
- ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

భీమవరం అర్బన్, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి భారతీయుడు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సూచించారు. ఈ మేరకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖను, జాతీయ జెండాను మంగళవారం భీమవరం పోస్టల్ డివిజన్ పరిధిలోని శాసన సభ్యులందరికీ అందించే కార్యక్రమం నిర్వహించారు. భీమవరం పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎస్‌వీ సత్యనారాయణ ఎమ్మెల్యేను కలిసి లేఖను, జెండాను అందించి హర్‌ఘర్ తిరంగా 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోస్టాఫీసు ద్వారా జెండాలను అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలన్నారు. పోస్టల్ అధికారులు అల్లు సురేష్ పాల్గొన్నారు.

- తణుకు : ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం సిద్ధించిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో 500 అడుగుల భారీ జాతీయ జెండా ర్యాలీలో విద్యార్థులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్, : ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో 380 అడుగులు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా యడ్లబజారు వరకు కొనసాగింది. కూటమి నాయకులు కర్నేన గౌరునాయుడు, ఉన్నమట్ల కపర్ది, రావూరి సుధ, పెచ్చెట్టి బాబు, ధనాని సూర్యప్రకాష్, తులా రామలింగేశ్వరరావు, కొండ ప్రసాద్, వీరాజీ, గవర పవన్‌నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.
- భీమవరంటౌన్ : ప్రతి భారతీయుడిలో దేశభక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బీజేపీ సీనియర్ నాయకుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కలిదిండి వినోద్‌కుమార్‌వర్మ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఇంటింటికి జాతీయ జెండా ఇచ్చి కట్టిచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు కాగిత సురేంద్ర, వినోద్‌వర్మ మాట్లాడారు. ఎ.శివ, కృష్ణంరాజు, అడ్డగర్ల ప్రభాకర్‌గాంధీ, రాజు, పితాని వెంకటేశ్వరరావు, గంటా లక్ష్మి, అరసవల్లి మణికంఠ, కొల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- పెంటపాడు : ముదునూరులో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా కన్వీనర్ పెదపోలు వీరరాఘవులు, మండల అధ్యక్షుడు దత్తు ప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులతో కలిసి 200 మీటర్ల జెండాతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నరిసే సోమేశ్వరరావు, బుద్దన బాబులు, బుద్ద నారాయణ, ఆరాధ్యుల అంజి తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు నక్కా వెంకటేశ్వరరావు మెమోరియల్ శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథాలయాధికారి మహమ్మద్ జుల్ఫికర్ ఆలీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఆకివీడు/పాలకోడేరు : ఎందరో మహనుభావుల పోరాటం ఫలితంగానే ప్రస్తుతం మనమందరం సంతోషంగా ఉన్నామని బీజేపీ ఉండి నియోజకవర్గ కన్వీనర్ కోరా రామ్మూర్తి అన్నారు. మంగళవారం ఆకివీడు గాంధీజీ సెంటర్ నుంచి మాదివాడ గాంధీజీపార్కు వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కట్రెడ్డి ఏడుకొండలు, జిల్లా నాయకులు నరహరిశెట్టి నానాజీ, నాగమణి, సన్నిధి మాణిక్యాలరావు, పట్టాభి, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. పాలకోడేరులో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం 500 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు జుత్తిగ నాగరాజు, దెందుకూరి రాఘురాం కోటేశ్వరరాజు, ఇందుకూరి కోటేశ్వరరాజు, గాదం నానాజీ, గాదిరాజు రఘు, కల్యాణ్, డి.కృష్ణ, మాధవ తదితరులు పాల్గొన్నారు.
- పెనుమంట్ర : పెనుమంట్ర మండలం మార్టేరులో పలు పాఠశాలల విద్యార్థులు, కూటమి నాయకుడు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తూ నినాదాలు చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పూరి. వెంకటరెడ్డి, పెనుగొండ మండల అధ్యక్షుడు నాగూర్ బాబు, పోడూరు మండల అధ్యక్షుడు బద్రి నారాయణరాజు, ఆచంట మండల అధ్యక్షుడు సుబ్బారావు, పనస పండు, వెంకటరావు, పుల్లాజీ, బ్రహ్మనందరెడ్డి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.
- నరసాపురం టౌన్ : నరసాపురం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి శివాలయం సెంటర్ వరకు పలు కాలేజీ విద్యార్థులు జెండాలు చేతబట్టి భారీ ప్రదర్శన చేశారు. పీవీఆర్, మునికోటి వెంకటేశ్వరరావు, గునిశెట్టి శ్రీను, వనమాల శ్రీనివాస్, పండు తదితరులు పాల్గొన్నారు.
- గణపవరం : గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు మానవహారం నిర్వహించి, పురవీధుల్లో ర్యాలీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

- మునిసిపల్ కమిషనర్ శ్యామల

భీమవరంటౌన్, ఆగస్టు 13 :పట్టణ పరిధిలో ఉన్న వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ర్యాబిస్ టీకాల కార్యక్రమాలు జాతీయ జంతు సంక్షేమ బోర్డు ఆఫ్ ఇండియాచే గుర్తింపు పొందిన స్నేహ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని మునిసిపల్ కమిషనర్ ఎం. శ్యామల మంగళవారం తెలిపారు. పట్టణ ప్రజల సంరక్షణలో భాగంగా ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ఆదేశాలతో అధికారికంగా టెండర్ల ద్వారా ప్రభుత్వంచే ఆ సంస్థ అనుమతి పొంది మునిసిపాల్టీతో ఒప్పంద అనుమతులు పొందారని తెలిపారు. పశువైద్యుల ద్వారా ప్రతీ వార్డులో కుక్కలను పట్టుకుని వాటికి స్థానికంగా ఏర్పాటు చేసిన ఏబీసీ సెంటర్, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్ల తరువాత వాటికి వైద్య ఆహారం సదుపాయం అందించి కోలుకున్న తరువాత మళ్లీ యథాస్థానంలో విడచిపెడతారన్నారు. పట్టణ ప్రజలు సదరు సంస్థకు చెందిన సిబ్బంది వీధుల్లోకి వచ్చినపుడు సహకారం అందించాలన్నారు. పశువుల ఆసుపత్రిలో ఉన్న ఏబీసీ సెంటర్‌ను ఏసీపీ గౌరు, సుంకర దాసు తదితరులతో కలసి ఆమె పర్యవేక్షించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ

పాలకొల్లు రూరల్ (యలమంచిలి), ఆగస్టు 13 : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నరసాపురం మండల న్యాయ సేవా సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యవక్తగా ఆయన మాట్లాడారు. వితంతు పెన్షన్‌కు అర్హులై ఉండి ఏకారణం చేతనైనా పెన్షన్ పొందని వారు న్యాయ సేవా సంస్థను ఆశ్రయించి తగిన సూచనలు పొందవచ్చన్నారు. న్యాయవాది ఫణికర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా పిల్లలను గమనించాలని సూచించారు. సెప్టెంబరు 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, డ్వాక్రా మహిళలు వారికి అందుబాటులో ఉన్న వారికి ఈ విషయాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మండల సమాఖ్య అధికారి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సంఘంలో అన్నిగ్రామాల వారిని చేర్పించాలి'

పాలకొల్లురూరల్ (యలమంచిలి), ఆగస్టు 13 : సంఘం స్థాపించి అన్ని గ్రామాల నుంచి సభ్యులను చేర్పించాలని సంయోజక శివశంకర్ అన్నారు. వీహెచ్‌పీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మేడపాడు వెంకాయమ్మ ఆలయంలో మంగళవారం అర్చక, పురోహిత సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ స్థాపనకు పలు సూచనలు చేశారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్ర, మండల కార్యదర్శి దివి ప్రకాష్, బజరంగ్ దళ్ జిల్లా సహ కన్వీనర్ వినుకొండ శివ, న్యాయవాది వీరాజీ, తోట సర్వేశ్వరరావు, బాలం అంజిబాబు, పతంజలి వల్లభ గణేష్, సుమారు 50 మంది అర్చక పురోహితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల వితరణ



బస్‌పాస్‌లు అందుకున్న విద్యార్థులతో రోటరీ సభ్యులు

తణుకు, ఆగస్టు 13: తణుకు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా బస్‌పాస్‌లు అందజేశారు. 200 మంది విద్యార్థులకు ఏడాది కాలానికి పాసులు ఇచ్చినట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థ తెలిపారు. హెచ్ఎం పద్మావతి, జీజే ప్రభువరం, రోటరీ సభ్యులు బసవా రామకృష్ణ, గమిని రాంబాబు పాల్గొన్నారు.

హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ

అత్తిలి, ఆగస్టు 13 : అత్తిలి హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా మంగళవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఐక్యరాజ్య సమితి స్పందించి బంగ్లాదేశ్‌లోని ఆలయాలు, హిందువులను రక్షించాలని కోరారు.

మద్యం సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

భీమవరం అర్బన్, ఆగస్టు 13 :గత ప్రభుత్వంలో అధికారిక నోటిఫికేషన్ ద్వారా నియమితులై ప్రభుత్వ మద్యం షాపులలో పని చేస్తున్న సేల్స్‌మెన్, సూపర్‌వైజర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం భీమవరం కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి అండగా ఉండాలని కోరారు. జిల్లా యూనియన్ నాయకులు దివాకర్, టి.శివకుమార్, ఎ.కృష్ణ, ఎస్.ప్రకాష్‌రెడ్డి, పీఎల్‌డీ ప్రసాదు, ఎం.కిరణ్‌కుమార్‌లతో పాటు ఆకివీడు, ఉండి, కాళ్ళ, నరసాపురం, మొగల్తూరు షాపులలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం 'నల్లారి' కొమ్ముచిక్కాల రాక

పాలకొల్లు, ఆగస్టు 13 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కొమ్ముచిక్కాలకు బుధవారం వస్తున్నారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు సూర్యనారాయణ ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు ఆయనను పరామర్శించేందుకు వస్తున్నట్టు వారు తెలిపారు.

మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సతీమణికి సత్కారం

భీమవరంటౌన్, ఆగస్టు 13 : మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి అని ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలు వీరోచిత పాత్ర వహించారని, ప్రస్తుత తరుణంలో మహిళలు దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ముందుంటున్నారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వర దేవి అన్నారు. 78వ భారత స్వాతంత్ర్య దిన వేడుకల పక్షోత్సవాల భాగంగా ఆమెను సత్కరించారు. ఆనాటి భీమవరం ఉద్యమంలో శ్రీనివాసవర్మ తాత భూపతిరాజు బాపిరాజు, సుబ్బతాతరాజు, అడవి బాపిరాజు వంటి పోరాట యోధులతో సమా నంగా కోటమర్తి కనకమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ సమానంగా పోరాటం సాగించారన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యుల సత్కారంలో భాగంగా ఆమెను సత్కరించామన్నారు. వేదపండితుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, తుమ్మలపల్లి ఆంజనేయప్రసాద్, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

కోమటిగుంటలో పరిశుభ్రతకు చర్యలు

కాళ్ళ, ఆగస్టు 13 : గ్రామం పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని కోమటిగుంట గ్రామ సర్పంచ్ బోణం భాగ్యంశ్రీ శివకుమార్ తెలిపారు. కోమటిగుంటలో డంపింగ్‌యార్డు వద్ద ఉన్న చెత్త రహదారి పైకి రాకుండా ఎక్స్‌కవేటర్‌తో పరిశుభ్రతకు మంగళవారం చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్త వేయరాదని తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆమె స్పష్టం చేశారు. డంపింగ్‌యార్డు వద్ద రహదారిపైకి చెత్త రావడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చెత్తను తొలగించి శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు.

పది, ఇంటర్ ప్రవేశాలపై అవగాహన ర్యాలీ

నరసాపురం రూరల్/ఆచంట, ఆగస్టు 13:ఏపీ సర్వవిద్యాపీఠం ఆదేశాలకు అనుగుణంగా మంగళవారం మండల విద్యాశాఖ అధికారులు 'మళ్లీ చదువుకుందాం' పది, ఇంటర్ ప్రవేశాలపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ సాగింది. ఎంఈవో పుష్పరాజ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆచంట మండలం ఆచంటలో దూర విద్యపై అవగాహనకల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు ఈనెల 31వ తేదీ వరకు అడ్మిషన్లకు గడువు ఉందన్నారు.

ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్ చంద్రబాబు

తణుకు, ఆగస్టు 13: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు మంగళవారం డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు అందించారు. సంఘ కార్యాలయంలో 29 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి పలు సూచనలిచ్చారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, కోశాధికారి అడ్డాల కృష్ణారావు, ఇవటూరి లక్ష్మణరావు, సీహెచ్. సాధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలి

- పెనుగొండ ఎంపీడీవో శ్రీనివాస దొర
- రెండోరోజు సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

జిల్లా వ్యాప్తంగా రెండోరోజు మంగళవారం సర్పంచ్, సెక్రటరీల శిక్షణ తరగతులు మంగళవారం కొనసాగాయి. ఆయా పంచాయతీల పరిధిలో పారిశుధ్యం, చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్త వేరుచేయట, వర్మీకంపోస్టు తయారీ, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



వడలిలో ఘన వ్యర్థాల నిర్వహణపై మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస దొర

పెనుగొండ/ ఆచంట/ గణపవరం /పాలకొల్లు /తాడేపల్లిగూడెం రూరల్/ నరసాపురం రూరలల్, ఆగస్టు 13 : ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని పెనుగొండ ఎంపీడీవో శ్రీనివాస దొర అన్నారు. వడలి గ్రామంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండోరోజు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆచంట మండలం ఆచంటలో ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో, గణపవరం మండలం గణపవరంలో రీసోర్స్‌పర్సన్ రామాంజనేయులు ఎంపీడీవో సూర్యనారాయణ ఆధ్వర్యంలో, పాలకొల్లు మండలం లంకలకోడేరులో చెత్త నుంచి సంపద సృష్టిపై టీవోటీ బి. ఆనందబాబు ఆధ్వర్యంలో, తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో, నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ శర్మ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఏరియా ఆసుపత్రి సిబ్బంది ధర్నా



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 13: తమకు మూడు నెలల జీతం బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది మంగళవారం ధర్నాకు దిగారు. ఆసుపత్రి సెక్యూరిటీ, పారిశుధ్య విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది కాంట్రాక్టర్ తన వంతు ప్రీమియం వెంటనే జమ చేయాలని, ఆసుపత్రి సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు జి. సురేష్, రాంబాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ఉండి ఆగస్టు 13: ఉండిలో నిరుపయోగంగా వున్న అబ్బాయిరాజు జన్మభూమి పార్కును దాతల భాగస్వామ్యంతో అభివృద్ధికి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు చేసిన కృషి అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ గొట్టుముక్కల సత్యనారాయణరాజు తెలిపారు. మంగళవారం ఉండి విచ్చేసిన ఆయన కలిదిండి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కలిదిండి అబ్బాయిరాజు సేవలను కొనియాడారు. పార్కు పనులు పూర్తి చేయించిన టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి తదితరులను అభినందించారు. మాజీ జడ్పీటీసీ కాగిత మహంకాళి, మంతెన సాయిలచ్చిరాజు, ముదునూరి కృష్ణంరాజు, గురుగుబిల్లి వెంకటసత్యనారాయణ, కరిమెరక శ్రీను, కర్రి శ్రీను, పెన్మెత్స గోపి, తక్కెళ్ల నరేష్ పాల్గొన్నారు.

షాపుల వేలం ఆదాయం రూ.14.34 లక్షలు

కాళ్ళ ఆగస్టు 13 : జువ్వలపాలెం పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న 12 షాపులకు మంగళవారం వేలంపాట నిర్వహించగా నెలకి రూ. 1,19,500 చొప్పున ఏడాదికి రూ.14.34 లక్షలు ఆదాయం వచ్చిందని ఈవోపీఆర్డీ ఎంవీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి జీకే శివరామరాజు తెలిపారు. పాటదారులకు మూడేళ్ల కాలపరిమితి వరకు లీజు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. గతంలో ఇవే షాపులు ద్వారా నెలకు రూ.20,500 చొప్పున ఏడాదికి కేవలం రూ.2.46 లక్షల ఆదాయం వచ్చేదని, ఇప్పుడు ఏడాదికి సుమారు మరో 12 లక్షల రూపాయలు అదనంగా ఆదాయం వచ్చిందని తెలిపారు.

కనక రత్నమాలకు డాక్టరేట్



రత్నమాల

ఆచంట, ఆగస్టు 13 : భీమలాపురం శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల పాండిచ్చేరిలోని జర్మనీ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారని ఆమె మంగళవారం తెలిపారు. ఇటీవలే వేరే రాష్ట్రం నుంచి డాక్టరేట్ పొందారు. రెండో డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

మహిళలకు చీరల వితరణ

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 13: పట్టణంలోని విశ్వదుర్గేశ్వరి ఆలయం వద్ద మంగళవారం గొర్రెల లక్ష్మీనారాయణ వర్ధంతిని టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్రెల శ్రీధర్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఆధ్యాత్మికం

ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న గన్ని వీరాంజనేయులు

గణపవరం, ఆగస్టు 13: గ్రామీణ ప్రాంతాల్లో అమ్మవార్ల జాతర్లు, తిరునాళ్ళు నిర్వహించుకోవడం ద్వారా కుల, మత విద్వేషాలు రూపుమాపేందుకు దోహదపడతాయని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజ నేయులు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం గణపవరం వెలంపేటలో వెంకయ్య వయ్యేరు ఒడ్డున ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, సురేంద్రకుమార్ రాజు, కాపారం చిన్న, కూనసాని నాగేశ్వరరావు, పల్లి వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, కూసం పూడి జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 13 : స్థానిక నాగరాజు పేటలోని వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అర్చకులు, పురోహితులు ఆవుపాలతో అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని 12వ వార్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, 24వ వార్డులోని శంభేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉండి రామాలయంలో భగవద్గీత పారాయణం

ఉండి ఆగస్టు 13:ఉండి కోదండ రామాలయంలో భగవద్గీత పారాయణ కార్యక్రమంను వైభవంగా నిర్వహించి పూజలు జరిపారు. మంగళవారం ఉండి కొండ్రోతుపేటలో వున్న కోదండ రామాలయంలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం జరిగింది. విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నల్లా కిరణ్‌ప్రసాద్, విశ్వ హిందూపరిషత్ అధ్యక్షురాలు సునీత భగవద్గీత పుస్తకాలను అందించారు. పెదపుల్లేరు ఆంజనేయులు, ఖండాపు శ్రీనివాసరావు, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.